పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 105. అల్ ఫీల్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 5 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఓ అరబ్బువాసులారా! మీ అవసరాలను తీర్చేవాడూ, ఆపదలను దూరం చేసేవాడు కేవలం అల్లాహ్ మాత్రమేనని ఈ సూరాలో వివరించబడింది. ఇంకా విగ్రహారాధన మానండి. విగ్రహాలు ఎటువంటి సహాయమూ చెయ్యవు. మీమీద విరుచుకుపడిన ఆపదను గుర్తుచేసుకోండి. అబ్రహా రాజు 60 వేల సైన్యంతో మీపై దాడి చేసి మిమ్మల్ని హతమార్చి, మీ భార్యాపిల్లలను బానిసలుగా చేసుకోవడానికి, మీ ఇళ్ళను తగలబెట్టడానికి, కాబాను కూల్చివేయడానికి వస్తున్నప్పుడు మీరు ఎంతో కంగారుపడ్డారు. అప్పుడు మీరు చాలా బలహీనులుగా ఉన్నారు. అప్పుడు కాబాలో 360 విగ్రహాలు ఉండేవి. ప్రతి విగ్రహాన్ని మీరు ఆరాధించారు. ప్రతి దాని ఎదుట చేతులు జోడించారు. ప్రతి దానికి సజ్దా చేశారు. వాటిని వేడుకున్నారు. ఏ విగ్రహమూ మీ దుఆ వినలేదు. మీకు ఏమీ సాయపడలేదు. చివరికి మీ సర్దారు అబ్దుల్ ముత్తలిబ్ కాబా పైన కప్పిన వస్త్రాన్ని (గిలాఫ్) పట్టుకుని అల్లాహ్‌ను ప్రార్థించాడు. ఓ అల్లాహ్! ఈ విగ్రహాలు ప్రాణంలేని రాళ్ళు. ఇవి దైవాలు కాదు. ఓ అల్లాహ్! మా ప్రభువు నీవే. ఆరాధ్యుడవు నీవే. సహాయం చేసేవాడవు నీవే. మాకు సహాయం చెయ్యి. మాపై కరుణించు. వెంటనే అల్లాహ్ అబాబీల్ పక్షుల్ని పంపాడు. వాటి ముక్కుల్లో కాళ్ళల్లో కంకరరాళ్ళు ఉన్నాయి. సిపాయిలపై పక్షులు రాళ్ళు వేసే సరికి సిపాయిలందరూ నమిలి ఊసిన మేతలాగా పడిపోయారు. అందరూ చచ్చారు. ఈ విధంగా మక్కా వారిని అల్లాహ్ రక్షించాడు. ఈ సంఘటనను గుర్తుచేసి అల్లాహ్ మక్కా వారిని ప్రశ్నిస్తున్నాడు. మీ మీద ఆపద వచ్చినప్పుడు మీకు సహాయం ఎవరు చేశారు? విగ్రహాలు చేశాయా? అల్లాహ్ చేశాడా? విగ్రహాలు మీకు సహాయం చేయలేదు అంటే ఈ విగ్రహాలు దేవుళ్ళు కాదని స్పష్టమయిపోయింది. అవసరాలు తీర్చేవి కావు. సహాయపడేవీ కాదు. కనుక వాటిని ఆరాధించకండి. సజ్దా చేయకండి. వాటికి ప్రదక్షిణలు చెయ్యకండి. ఆయనే దైవం, సహాయం చేసేది ఆయనే. కనుక అల్లాహ్‌నే ఆరాధించండి. ఆపదలలో పనికొచ్చేవాడు ఆయనే. ముహమ్మద్ (స) జన్మించిన సంవత్సరమే ఈ సంఘటన జరిగింది. ఆ కాలంలో చాలామంది ఈ సంఘటనను కళ్ళారా చూసినవారు అనేకమంది ఉన్నారు.

## 105. అల్ ఫీల్

**ఆయత్‌లు : 5** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో

(1) ఏనుగుల వాళ్ళతో మీ ప్రభువు ఎలా వ్యవహరించాడో మీరు చూడలేదా? (2) వారి కుటిల పన్నాగాలను వమ్ము చేయలేదా? (3) వారిపై పక్షులను గుంపులు గుంపులుగా పంపాడు.

(4) అవి వాళ్ళపై కంకర రాళ్లను వేశాయి.

(5) వారిని నమలబడిన తొక్కుగా చేసేశాయి.

رُكُوعُهَا 1 — سُورَةُ الْفِيلِ مَكِّيَّةٌ 105 — آيَاتُهَا 5

بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِأَصْحٰبِ الْفِيْلِ ﴿1﴾

أَلَمْ يَجْعَلْ كَيْدَهُمْ فِيْ تَضْلِيْلٍ ﴿2﴾

وَّأَرْسَلَ عَلَيْهِمْ طَيْرًا أَبَابِيْلَ ﴿3﴾

تَرْمِيْهِمْ بِحِجَارَةٍ مِّنْ سِجِّيْلٍ ﴿4﴾

فَجَعَلَهُمْ كَعَصْفٍ مَّأْكُوْلٍ ﴿5﴾ ع 1 5 30

1 – 5 వాక్యాలు

మక్కావారు తౌహీద్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. విగ్రహాలను స్తుతించేవారు. అల్లాహ్ వారిని ప్రశ్నిస్తున్నాడు. మీపై, మీ జాతిపై, మీ సంతానంపై, మీ కాబాపై ప్రమాదం విరుచుకుపడినప్పుడు మీకు సహాయం చేసింది ఎవరు? విగ్రహాలు చేశాయా? అల్లాహ్ చేశాడా? మీరీ సంఘటనను ఎరుగుదురు. ఈ సంఘటనను మీరు కళ్ళారా చూశారు. అల్లాహ్ తన అబాబీల్ పక్షుల్ని పంపి మీకు సహాయం చేశాడు. ఇది మక్కా చరిత్రలోనే గొప్ప సంఘటన. దీన్ని మీరు మీ పెద్దల ద్వారా విన్నారు. అప్పుడు అల్లాహ్ మీకు సహాయపడటాన్ని మక్కా చరిత్రలో చదివారు. హజ్రత్ ముహమ్మద్ (స) బోధించే విషయమూ ఇదే. ప్రజలారా! మీరు అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనే దైవం. సహాయం చేసేవాడు ఆయనే. ఆపదలో ఆదుకునేవాడు ఆయనే. మరి మీరు ముహమ్మద్ (స)ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?